

ఘనంగా దసరా వసంతోత్సవం

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

దసరా పండుగ అనంతరం మరుసటి రోజు వచ్చే వసంతోత్సవ పండుగను పోరుమామిళ్ల ఆర్యవైశ్య పురుషులు, మహిళలు, పిల్లలు బుధవారం పెద్ద ఎత్తున జరుపుకున్నారు. శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారిని మలకత్వల దగ్గర ఉన్న జమ్మి చెట్టు వరకు ఊరేగింపుగా తీసుకెళుతూ ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుంటూ, డాన్సులు వేసుకుంటూ, తలలు వేసుకుంటూ అట్టహాసంగా, ఆనందంగా, ఉత్సాహంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మధ్యాహ్నం అమ్మవారి శాలలో ప్రజలందరికీ భోజన ఏర్పాట్లు కల్పించారు. సాయంత్రం దోలోత్సవం సేవతో దసరా ఉత్సవాలకు ముగింపు పలకడం జరిగిందని దేవస్థానం కమిటీ అధ్యక్షుడు గాజులపల్లి శ్రీనివాసులు శ్రేష్ఠి పేర్కొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక అమీన్‌పీర్ దర్గా

- నవంబర్ 25 నుంచి ఉరుసు ఉత్సవాలు ప్రారంభం
- ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా, కలెక్టర్ వి.విజయ్ రామరాజు వెల్లడి



ఉరుసు ఉత్సవాల బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి, కలెక్టర్, దర్గా పెద్దలు

ప్రజాశక్తి-కడప అర్బన్

అమీన్‌పీర్ దర్గా ఉరుసు ఉత్సవాలను కులమతాలకు అతీతంగా మతసామరస్యంతో కలిసికట్టుగా నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా, కలెక్టర్ వి.విజయ్ రామరాజు పిలుపునిచ్చారు. నవంబర్ నెల 25వ తేదీ నుండి డిసెంబర్ 1వ తేదీ వరకు జరుగనున్న ఉత్సవాలకు సంబంధించి బుధవారం స్థానిక అమీన్‌పీర్ దర్గాలోని ముషాయిరా హాల్‌లో ఉత్సవాల నిర్వహణ, ముందస్తు ఏర్పాట్లపై పీఠాధిపతి జనాబ్ ఆరిఫ్ ఉల్లా హుసేని అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజాద్ బాషా మాట్లాడుతూ శతాబ్దాల నాటి చరిత్ర కలిగిన ప్రఖ్యాత అమీన్‌పీర్ దర్గా ఉత్సవాలను మత సామరస్యాన్ని ప్రతిబింబించేలా ఉరుసు ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరారు. ముందస్తు ప్రణాళికతో కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతోందన్నారు. దర్గా కమిటీ సభ్యులు, జిల్లా యంత్రాంగం అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కలెక్టర్ వి.విజయ్ రామరాజు మాట్లాడుతూ మన కడపలో మన పండుగగా భావించే కడప అమీన్‌పీర్ దర్గా ఉత్సవాలను అందరూ కలిసి కట్టుగా పనిచేసి విజయవంతం చేయాలని అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరారు. మళ్లీ ఉరుసు మహోత్సవాలకు కొన్ని రోజుల ముందుగానే అన్నిరకాల ఉత్సవ ఏర్పాట్లను ఒక్కొశాఖ జిల్లా అధికారుల పర్యవేక్షణలో నిర్వహించడం జరుగుతుందన్నారు. పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేయాలని ఎక్కడా ఎలాంటి సంఘటనలకు తావివ్వకుండా గట్టి భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం కడప నగరంలో పలు రకాలైన అభివృద్ధి పనులు జరుగుతున్నందున ఆయా ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా అందుకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కమిటీ సభ్యులైన అధికారులకు సూచించారు. ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ మాట్లాడుతూ అమీన్‌పీర్ దర్గా ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లను చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్దేశించిన ప్రాంతాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. అదనపు భద్రతా సిబ్బందిని కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉరుసు నిర్వహణా ఏర్పాట్లకు సంబంధించి జిల్లా అధికార యంత్రాంగం నుండి చేపట్టాల్సిన కార్యక్రమాలపై తయారు చేసిన ఎస్‌ఒపిని పీఠాధిపతుల వారికి కలెక్టర్ సమర్పించారు. అనంతరం ఉరుసు ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఎస్.బి.అంజాద్ బాషా, కలెక్టర్ విజయ్ రామరాజు, ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు ఉరుసు మహోత్సవ బ్యానర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెసి జి.గణేష్ కుమార్, నగర కమిషనర్ సూర్య సాయిప్రవీణ్ చంద్, శిక్షణ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్‌ఒ గంగాధర్ గౌడ్, ఆర్‌డిఒ ధర్మచంద్రారెడ్డి, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, నగర కార్పొరేటర్లు, దర్గా కమిటీ సభ్యులు గోవర్ధన్ రెడ్డి, హరిప్రసాద్, అమీర్‌బాబు, సుభాన్ బాషా, అహ్మద్ బాషా, రాష్ట్ర వేర్ హౌస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కరీముల్లా, కడప మార్కెట్ యార్డు చైర్మన్ నాగయ్య, ఉరుసు ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

- 4న జిల్లా సదస్సు జయప్రదం చేయండి
- వామపక్ష కార్మిక, రైతు సంఘాల నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్, నాగసుబ్బారెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

రైతు, కార్మికుల వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని సాగనంపాలని దేశవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమంలో భాగంగా నవంబర్ 26, 27, 28వ తేదీలలో విజయవాడ రాజభవన్ వద్ద జరిగే మహాధర్మాలను జయప్రదం కోసం ఈనెల 4న కడప ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించే జిల్లా స్థాయి సదస్సును జయప్రదం చేయాలని వామపక్ష కార్మిక, రైతు సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శులు బి.మనోహర్, నాగసుబ్బారెడ్డి, కార్యదర్శులు దస్తగిరిరెడ్డి, ఎం.సుబ్బారెడ్డి, వి.అన్వేష్, డబ్ల్యూ రాము, రమణయ్య కోరారు. బుధవారం ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు పంటలకు సమగ్ర ఉత్పత్తివ్యయానికి అదనంగా 50 శాతం కలిపి చట్టబద్ద మద్దతు ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కౌలురైతులతో సహా రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పెంచి పంట రుణాలు అందించాలని కోరారు. కేరళలో మాదిరి రైతు రుణ ఉపసమన చట్టంను పార్లమెంట్‌లో చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక సంక్షేమాన్నికి నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని పేర్కొన్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌తో సహా ప్రభుత్వ రంగాన్ని అమ్మడాన్ని అడ్డుకోవాలని పేర్కొన్నారు. రాజ్యాంగ ప్రసాదించిన ప్రాథమిక హక్కులను రక్షించుకునేందుకు ఆందోళన చేపట్టాలని చెప్పారు. ఉపాధి హామీ పథకాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించాలని, తదితర అంశాలపై విజయవాడలో నవంబర్ 26, 27, 28వ తేదీలలో రాజ్ భవన్ ఎదుట మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దుష్టపరిపాలన చేస్తున్న మోడీ-బిజెపిని, జగన్-వైసిపి ప్రభుత్వాలను గద్దె దించేందుకు ప్రజానీకాన్ని చైతన్య పరుస్తామని పేర్కొన్నారు. లక్షల కోట్ల రూపాయల ప్రజా సంపదను అదాని, అంబానీలకు కేంద్ర ప్రభుత్వం దోచిపెడుతుందని పేర్కొన్నారు. కృష్ణా జలాల పంపిణీ సక్రమంగా లేదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయం తెలిసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఏం మాట్లాడకపోవడం చాలా దుర్మార్గమని పేర్కొన్నారు. ప్రజా కంఠక ఉపా, దేశద్రోహం, మనీ ల్యాండ్ రింగు నిరారోపణలతో ప్రతిపక్ష నాయకులను, సంస్థలను వేధిస్తూ కేంద్ర ప్రభుత్వం రైతు కార్మిక విధానాలను అనుసరిస్తుందని పేర్కొన్నారు. ఒక క్షణం కుడా బిజెపికి పరిపాలన చేసే అర్హత లేదని స్పష్టం చేశారు. ఈ సదస్సులో భవిష్యత్ కార్యాచరణ రూపొందించినందుకు జిల్లా స్థాయిలో సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు వామపక్ష, కార్మిక, సంఘాల రాష్ట్ర నాయకులు హాజరవుతున్నట్లు చెప్పారు. సమావేశంలో కార్మిక సంఘం నాయకులు బాదుల్లా మదిలేటి, రవికుమార్ పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాల అందుకున్న పోలీస్ సిబ్బందితో సిద్దార్థ కౌశల్

ఉత్తమ సేవలకు అవార్డులు : ఎస్‌పి

ప్రజాశక్తి-కడప అర్బన్

విధినిర్వహణలో ఉత్తమ సేవలందించిన పోలీసులకు అవార్డులు ఇస్తామని ఎస్‌పి సిద్దార్థ కౌశల్ అన్నారు. పోలీస్ సిబ్బందిని ప్రోత్సహించే క్రమంలో ఇటీవల అత్యుత్తమ పనితీరు కనబరచిన వారికి 'వీక్లీ బెస్ట్ ఫెర్మార్మన్స్ అవార్డు'ను అందచేస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో మొట్ట మొదటిసారిగా బుధవారం ముగ్గురు సిబ్బందిని ఎంపిక చేసి నగదు రివార్డు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రొద్దుటూరు రూరల్ పరిధిలో ఎనిమిదేళ్ల కిందట జరిగిన హత్య కేసులో నాన్ బెయిలబుల్ వారంట్ ఉంటూ తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని శ్రమించి అరెస్టు చేశారు. ప్రొద్దుటూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు బి.శ్రీనివాస్ (పి.సి.2859), ఎన్.మధుసూదన్‌రెడ్డి(పి.సి.2687)లను ఎస్‌పి నగదు రివార్డు, ప్రశంసా పత్రం అందచేసి అభినందించారు. మోటార్ సైకిళ్ళ దొంగను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన చెన్నూరు కానిస్టేబుల్ బాషా(సి.సి.2118) ద్విచక్ర వాహనాల దొంగ నుండి 6 మోటార్ సైకిళ్ళు స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించినందుకు ప్రత్యేకంగా అభినందించారు. స్ఫూర్తిదాయకమైన సేవలు అందించి పోలీస్ శాఖ ఔన్నత్యాన్ని పెంపొందించారని, మున్ముందు ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని ఆకాంక్షించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని స్థానిక సెయింట్ ఆంటోనిస్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, లీడ్ శిక్షణ తరగతులను రెండు రోజులపాటు ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిత్త ప్రభావతి తెలిపారు. మొదటిరోజు లీడ్ శిక్షణ తరగతులను ఒకటి నుంచి ఐదు వరకు బోధించే ఉపాధ్యాయులకు, సులభ పద్ధతిలో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా కొన్ని మెలకువలను తెలిపారు. రెండవ రోజు టివి పాఠ్యాంశాలను బోధించేలా లీడ్ శిక్షణ సహాయకులు అబ్దుల్‌రజాక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిడిపిఒలు బాధ్యతగా పనిచేయాలి

ప్రజాశక్తి - కడప

జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారిత(ఐసిడిఎస్)శాఖలో సిడిపిఒలు బాధ్యతగా, సేవా దృక్పథంతో పని చేసినప్పుడే ఆరోగ్యకరమైన సమాజాన్ని చూడగలమని కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని విసి హాలులో ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు గజ్జెల వెంకట లక్ష్మీలతో కలిసి కలెక్టర్ వి.విజయ్ రామరాజు సిడిపిఒలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకా లను పొందుతున్న ప్రతి లబ్దిదారు కుటుంబం కూడా అంగన్వాడీ సేవలను పొందేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రణాళిక ప్రకారం ప్రతి సిడిపిఒ రోజుకు రెండు చొప్పున వారి పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలను విధిగా తనిఖీ చేయాలన్నారు. ఆయా కేంద్రాలలో బాలింతలు, గర్భిణులు, చిన్నా రులకు పౌష్టికాహారం పంపిణీ, వారి ఆరోగ్య స్థితికి సంబంధించి రిపోర్టుతో పాటు సంక్షేమ వసతి గృహాల్లో బాలికల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకో వాలన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా అనీమిక్ సమస్యలు ఎదుర్కొంటున్న బాలికలకు, బరువు తక్కువ పిల్లలకు పోషకాహారం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో కేవలం బాలింతలకు, గర్భిణులకు, బాలబాలికలకు మాత్రమే కాకుండా మహిళలకు, వృద్ధులకు కూడా సేవలు సేవలు అందివ్వాలని సూచించారు. బాలింతలు, గర్భిణులకు ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. వారికి సరైన పౌష్టికాహారం, ప్రణాళిక ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహిస్తూ మహిళలు, బాలికలకు రక్త హీనత సమస్యలు రాకుండా వైద్య శాఖ సిబ్బంది సమన్వయంతో పర్యవేక్షణ చేయాలన్నారు. గర్భిణిలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎప్పుడు ఎలాంటి వాక్సిన్ వేయించుకోవాలన్న విషయాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. మహిళలు, చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందినపుడే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. సిడిపిఒలు బాధ్యతగా పనిచేయకపోతే శాఖా పరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. ముఖ్యంగా చైల్డ్ మ్యారేజెస్, టీనేజీ ప్రెగ్నెన్సీలను ఎక్కడా ప్రోత్సహించకుండా తల్లిదండులకు. అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడయినా 18 ఏళ్లలోపు బాలికలకు వివాహం జరిగితే.. వారు తల్లిదండ్రులపై కేసులు ఫైల్ చేయాలన్నారు. వైఎస్ఆర్ జిల్లాను మాతృ మరణాలు లేని జిల్లాగా తీర్చిదిద్దడానికి వైద్య ఆరోగ్య, ఐసిడిఎస్ సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు. ఐసిడిఎస్ ప్రాజెక్టులలో ఎలాంటి సమస్యలు వున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని ప్రాజెక్టులకు చెందిన సిడిపిఒలు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక తొలగింపు అన్యాయం

- మైనార్టీ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు షేక్ దస్తగిరి

ప్రజాశక్తి-కడప అర్బన్



మాట్లాడుతున్న దస్తగిరి

నగరంలోని యాకూబ్ సాహెబ్ మసీదు శ్మశాన వాటిక స్థలాన్ని రోడ్డు విస్తరణ పేరుతో అక్రమంగా తొలగించడం అన్యాయమని మైనార్టీ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు షేక్ దస్తగిరి అన్నారు. బుధవారం ఎంఆర్‌ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముస్లింలకు అత్యంత పవిత్రమైన యాకూబ్ సాహెబ్ మసీదు శ్మశాన వాటికలో కొంత స్థలాన్ని కడప కార్పొరేషన్ అధికారులు చేపట్టిన తొలగింపు చర్యలు సబబు కాదని ఆరోపించారు. చట్టబద్ధంగా భూ సేకరణకు అధికారులు ప్రయత్నించ లేదన్నారు. కేవలం ఏకపక్షంగా మసీదు స్థలాన్ని, స్మశాన వాటికలోని అత్యంత విలువైన కొంత భాగాన్ని స్వాధీనపర్చుకోవడానికి చేపట్టిన చర్యలు అనధికారిక పరిధి కింద వస్తాయన్నారు. ముందుగా మసీదు కమిటీ తీర్మానం ద్వారా కలెక్టర్ సారథ్యంలో సంప్రదింపులు జరిగిన అనంతరం, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్‌కు సదరు తీర్మానం నివేదించి, తదుపరి సమావేశ తీర్మానం తర్వాత మసీదు స్మశాన వాటికపై తగు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు. శ్మశాన వాటికకు సంబంధించి అధికారులు, అధికార వైసిపి ప్రభుత్వంలోని నేతల ఒత్తిళ్లకు తలొగ్గి మసీదు కమిటీ అంగీకారంతో ప్రమేయం లేకుండా రూ.7.80 కోట్ల నష్టపరిహారాన్ని వక్ఫ్ బోర్డులో జమ చేసి చేతులు దులుపుకున్నారన్నారు. ఈ వ్యవహారంపై మసీదు కమిటీ హైకోర్టులో కేసు దాఖలు చేసి పెండింగులో ఉన్నప్పటికీ అధికారులు రోడ్డు విస్తరణపై చర్యలు సరికాదన్నారు.

పిల్లల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు : జడ్జి

ప్రజాశక్తి - కడప

పిల్లల పట్ల ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు వహించాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఇన్చార్జి సెక్రెటరీ ఎస్.కవిత ఆదేశించారు. బుధవారం ఆమె ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహాన్ని సందర్శించారు. అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పిల్లలకు అందుకున్న వసతి సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. వంటశాలను, వసతి గదులను, రిజిస్టర్లను పరిశీలించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2015 వివరించారు. పిల్లల పట్ల ఎప్పటికప్పుడు తగు జాగ్రత్త వహించాలని ఆదేశించారు. జువెనైల్ జస్టిస్ చట్టం, న్యాయ సహాయం రక్షణ సలహా వ్యవస్థ, ఉచిత న్యాయ సహాయం వంటి అంశాలను గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహం సూపరిండెంట్, వైద్యాధికారి, పిల్లలు పాల్గొన్నారు.

తప్పుడు కేసులో బాబును అరెస్టు చేయించారు

ప్రజాశక్తి-కడప అర్బన్ : టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడుని తప్పుడు కేసులో ప్రభుత్వం జైల్లో పెట్టించిందని టిడిపి సీనియర్ నాయకులు లక్ష్మీరెడ్డి, కడప నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి అమీర్ బాబు, నాయకులు మన్మోహన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం గౌస్‌నగర్‌లో భవిష్యత్తు గ్యారెంటీ, బాబుతో నేను, శ్రీశక్తి కార్యక్రమం ప్రజల వద్దకు తీసుకు వెళ్లారు. కరపత్రాలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భువనేశ్వరుని రోడ్డుపైకి తీసుకొని వచ్చి వైసిపి నాయకులు వైశాచిక ఆనందం పొందుతున్నారని విమర్శించారు. లోకేష్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ముందుకు వెళుతున్నారని చెప్పారు. జగన్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. న్యాయం జలవాలి అనే కార్యక్రమాన్ని ప్రజల వద్దకు తీసుకువెళ్లేందుకు నారా భువనేశ్వరి బస్సు యాత్ర చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆమూరి బాలరాజు, తెలుగు యువత నగర అధ్యక్షులు మేకల వెంకటేష్ యాదవ్, నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య, న్యాయవాది లింగాల శివశంకర్ రెడ్డి, మాజీ వార్డ్ మెంబర్ జయరామిరెడ్డి, పాలకొండ స్వామి ఆలయ మాజీ చైర్మన్ ఓబుల్ రెడ్డి, మాజీ ఎంపిటిసి పిచ్చయ్య, బాబా ఫక్రుద్దీన్, కొండాయపల్లి నాగేంద్ర నాయుడు, ఆరవ డివిజన్ సీనియర్ నాయకులు మామిళ్ళ శివ, పుట్లంపల్లి మురళీమోహన్, నవీబీ కోట శ్రీనివాసులు, మైనార్టీ నాయకులు ఇమ్రాన్, నాసర్ అలీ, బుల్లెట్ నూర్, అమానుల్లా, వల్లి, సయ్యద్ నూర్, ఏలియా బాబు, మహిళా నాయకురాలు చిప్పగిరి మీనాక్షి, స్వర్ణలత, నిర్మల, అరుణ పాల్గొన్నారు.



గౌస్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

వేగవంతంగా పాడా అభివృద్ధి పనులు : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

ప్రజాశక్తి-కడప

పాడా పరిధిలోని పులివెందుల నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను డిసెంబర్ నాటికి సంపూర్తి చేయాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో పులివెందుల నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్‌తోపాటు అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య, పాడా ఒఎస్‌డి అనిల్ కుమార్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ్ రామరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్వంత నియోజకవర్గం పులివెందులలో చేపట్టిన అభివృద్ధి పనులన్నింటినీ వేగవంతం చేసి నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. పులివెందులలో పురోగతిలో ఉన్న వివిధ అభివృద్ధి పనులలో భాగంగా ప్రధానంగా సిటీ సెంట్రమ్, ఉలిమెల్ల లేక్ వ్యూ, జగనన్న హౌసింగ్ కాలనీల్లో మౌలిక వసతులతో పాటు.. మోడల్ టౌన్‌లో భాగంగా చేపట్టే వివిధ అభివ ృద్ధి పనుల కోసం చేపట్టిన భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి సమస్య, పెండింగ్ లేకుండా క్లియర్ చేయాలని సబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పులివెందుల ఆర్‌డిఒ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, ఆర్అండ్‌బి, పిఆర్, అగ్రికల్చర్ మార్కెటింగ్, హౌసింగ్, మోడల్ టౌన్ కన్సల్టెన్సీ ప్రతినిధులు, ఎపిఎంఎస్‌ఐడిసి ఎస్‌ఇ, ఇఇలు, పాడా అధికారులు, రెవెన్యూ, ఇంజినీరింగ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై 27న చలో మైదుకూరు

ప్రజాశక్తి-కడప

రైతు సమస్యలపై ఈ నెల 27వ తేదీన చలో మైదుకూరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని డిసిసి అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు, నగర అధ్యక్షులు వై. విష్ణుప్రీతంరెడ్డి పేర్కొన్నారు రాష్ట్రంలో ప్రత్యేకించి జిల్లాలో కరువు విలయతాండవం చేస్తుందని, రైతులకు రైతు కూలీలకు పనులు లేక వలస పాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతు సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం మైదుకూరులో ర్యాలీ, కార్నర్ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు కడప రోడ్డులోని శిరిడి సాయిబాబా గుడి నుండి ర్యాలీ ప్రారంభమై నాలుగు రోడ్ల కూడలి మీదుగా వనిపెంట జంక్షన్ వరకు చేరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి, పిసిసి ఉపాధ్యక్షులు నజీర్ అహ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సత్తార్, రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యులు కమలమ్మ, అసెంబ్లీ సమన్వయ కమిటీ కన్వీనర్లు, సభ్యులు పాల్గొంటారని తెలిపారు.

నిజాయితీ నిరూపించుకోవాలి

ప్రజాశక్తి - కడప

స్కిల్ డెవలప్మెంట్ స్కాం డబ్బు చంద్రబాబు రాష్ట్ర ఖజానాకు జమ చేయాలని జిల్లా వ్యాప్తంగా వైసిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో పోస్ట్ కార్డ్స్ ఉద్యమం బుధవారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా సేకరించిన పోస్ట్ కార్డులను పట్టణంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ పోస్ట్ బాక్స్‌లో వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నీతిని నిరూపించుకోవాలంటే స్కాం చేసిన డబ్బులు రాష్ట్ర ఖజానాకు జమ చేయాలన్నారు. నిజాయితీని నిరూపించుకొని ప్రజల చేత మన్ననలు పొంది దాని తర్వాత నిజం గెలవాలని కార్యక్రమం నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించవద్దన్నారు. కార్యక్రమంలో ఒకటవ డివిజన్ కార్పొరేటర్ చెన్నయ్య, లక్ష్మీనారాయణ, అంజి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్యాంపునకు అభిరామ్ ఎంపిక

ప్రజాశక్తి-కడప

జాతీయ స్థాయి క్యాంపునకు ఆర్ట్స్ కళాశాలకు చెందిన ఎన్‌సిసి క్యాడేట్ అభిరామ్ ఎంపిక కావడం అభినందనీయమని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్, ఎన్‌సిసి అధికారి నీలయ్య పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే క్యాంపులలో విద్యార్థులు పాల్గొనడం ద్వారా వివిధ రాష్ట్రాల వారసత్వం, సంస్కృతి, ఆచారాలు, సంప్రదాయాలను అవగాహన చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి నవంబర్ 5వ తేదీ వరకు జాతీయ స్థాయిలో పంజాబ్‌లో నిర్వహించే ఏక్ భారత్ శ్రేష్ఠభారత్ ఎన్‌సిసి క్యాంపుకు కళాశాల ఎన్‌.సి.సి క్యాడెట్ అభిరామ్ ఆంధ్ర రాష్ట్రం నుంచి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం అభిరామ్ కళాశాల ప్రిన్సిపల్, ఎన్‌సిసి అధికారులు అభినందించారు. ఈ క్యాంపులో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం యొక్క సంస్కృతి, సాంప్రదాయాల గురించి అభిరామ్ తెలియజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్‌సిసి అధికారి డాక్టర్ నీలయ్య, మహేష్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ విశ్వనాథరావు, వైస్ ప్రిన్సిపల్ రమేష్ అభినందించారు.



అభిరామ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్, ఎన్‌సిసి అధికారి



సమావేశంలో మాట్లాడుతున్న పాలగిరి శివ

ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-కడప

ఎస్‌పి నిర్వహించే స్పందన కార్యక్రమంలో సమస్యపై ఫిర్యాదు చేశామని, సమస్య పరిష్కరించాలని ఆయన ఆదేశించినా చాపాడు పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పాలగిరి శివ అన్నారు. తప్పు చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాపాడు మండలం తిప్పిరెడ్డిపల్లిలో నివసిస్తున్న సగినాలబాష అనే వ్యక్తి జీవనోపాధి కోసం గొర్రెలు పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నాడన్నారు. అదే గ్రామానికి చెందిన పామిడి రఘురాం వద్ద సగినాలబాష అవసరం నిమిత్తం రూ.3 లక్షలు అప్పుగా తీసుకున్నాడని తెలిపారు. అప్పుగా తీసుకున్న డబ్బులకు వడ్డీ కూడా చెల్లిస్తూ ఉండేవాడన్నారు. బాష ఆర్థిక పరిస్థితి బాగా లేనందున అప్పుగా తీసుకున్న డబ్బులను తిరిగి ఇచ్చేందుకు కొంత సమయం ఇవ్వాలని రఘురాంను కోరాడన్నారు. అందుకు రఘురాం అంగీకరించలేదన్నారు. బాషా వద్ద ఉన్న 100 మూగజీవాలను దౌర్జన్యంగా స్వాధీనం చేసుకోవడంతో పాటు బాషా సతీమణిని దుర్భాషలాడారని పేర్కొన్నారు. చాపాడు మండల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఎస్‌పికి రెండుసార్లు ఫిర్యాదు చేసిన ఎటువంటి న్యాయం జరగకపోవడం బాధాకరమైన విషయమన్నారు. ఎస్‌పి స్పందన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మానవ హక్కుల సంఘం తరపున ఫిర్యాదు చేశామన్నారు. సమావేశంలో మానవ హక్కుల సంఘం ఉపాధ్యక్షులు అర్.సిద్దయ్య, బాధ్యులు సగినాల బాష పాల్గొన్నారు.

భూమి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-కడప అర్బన్

40 సంవత్సరాల కిందట తాను కొనుగోలు చేసిన భూమిని వైసిపి చెందిన దాసరి రామాంజనేయులురెడ్డి ఆక్రమించుకుంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని తొండూరు మండలం సంత కొవ్వూరు గ్రామానికి చెందిన మునిరాజు కోరారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో అఖిలపక్ష కమిటీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతకోవూరుకు చెందిన తాను 40 సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకుని జీవనం చేసుకుంటున్నానని తెలిపారు. మా గ్రామంలో సర్వే నెంబర్ 524లో 1.32 సెంట్లు పట్టా భూమి ఉందన్నారు.ఈ భూమిని 40 ఏళ్ల కిందట నల్లబోతుల శంకరయ్య అనే వ్యక్తి దగ్గర నుంచి కొనుగోలు చేశానని తెలిపారు. భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు ఉన్నాయని ఆ భూమిలోనే పంటలు వేసుకొని బతుకుతున్నామని తెలిపారు. వైసిపికి చెందిన దాసరి రామాంజనేయరెడ్డి 0.66 సెంట్లు భూమి నాది అని దౌర్జన్యంగా పొలంలోకి వస్తే చంపేస్తానని రామచంద్రారెడ్డి, నారాయణమ్మ వారి కుమారుడు నన్ను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై తహశీల్దార్‌ను కలిసి ఫిర్యాదు చెప్పినా ఏమాత్రం పట్టించుకోవడంలేదని తెలిపారు. దళిత కుటుంబంలో పుట్టడమే తాము చేసిన పాపమా అని ప్రశ్నించారు. మా భూమిలో సగభాగం 66 సెంట్లు అన్యాయంగా ఆక్రమించుకున్నారని పేర్కొన్నారు. వారిపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. విలేకరుల సమావేశంలో బాధితునికి అండగా అఖిలపక్ష కమిటీ నాయకులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్.ఎ.సత్తార్, బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి ఎస్.గురప్ప, సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి డబ్ల్యూ రాము, లోక్‌సత్తా పార్టీ జిల్లా నాయకులు శ్రీకృష్ణదేవరా, కడప జిల్లా ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు మేదర రవికుమార్, హేతువాద సంఘం జిల్లా కార్యదర్శి సి.ఆర్.వి.ప్రసాద్ రావు పాల్గొన్నారు.


ప్రతాప్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆర్ఎం మురళీమోహన్

ప్రతాప్‌రెడ్డి సేవలు ప్రశంసనీయం

- బ్యాంకు ప్రారంభోత్సవంలో ఆర్ఎం మురళీమోహన్

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని తాళ్ల ప్రొద్దుటూరులో నూతనంగా ఏర్పాటు చేసిన కెనరా బ్యాంక్ కార్యాలయాన్ని బుధవారం రీజనల్ మేనేజర్ కె.మురళీమోహన్ ప్రారంభించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ తాళ్ల ప్రొద్దుటూరులోని కెనరా బ్యాంకు గండికోట వెనుక జలాల్లో మునిగి పోవ డంతో.. కొం డాపురం మం డలంలోని ప్రజలకు సేవలు అందిం చలేమేమో అనే సం దిగ్ధంలో బ్యాంకు యాజ మాన్యం ఉన్నప్పుడు జోగాపురం గ్రామానికి చెం దిన కల్లూరు ప్రతాప్‌రెడ్డి తమకు ఎంతో సహకారం అందించారని తెలిపారు. ఆయన సహకారంతో తాత్కాలికంగా జోగాపురంలోని ఆయన నివాస గృహంలో బ్యాంకు ఏర్పాటు చేశామన్నారు. ప్రతాప్‌రెడ్డి సేవలు మరువలేనివని కొనియాడారు. రీజనల్ మేనేజర్ ప్రతాప్‌రెడ్డిని సన్మానించారు. తాళ్ల ప్రొద్దుటూరు కెనరా బ్యాంకులో ఏడాదికి సుమారు రూ.136 కోట్లు లావాదేవీలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ లావాదేవీలను రూ.150 కోట్లకు చేర్చాలని కోరారు. హెల్ప్ లైన్ నెంబర్ 1800 1030కు ఫోన్ చేసి, సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం ఆర్ఎం పలువురు ఖాతాదారులను సన్మానించారు. కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ ఎవి రాజశేఖర్, స్థానిక బ్రాంచ్ మేనేజర్ చంద్రశేఖర్, బ్యాంకు సిబ్బంది, ఎస్‌పి మోహన్, ఖాతాదారులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై రక్షణభేరి : సిపిఎం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం ఆధ్వర్యంలో ప్రజారక్షణ భేరి కార్యక్రమం పేరుతో బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జమ్మలమడుగు కార్యదర్శి వీరనాల శివనారాయణ తెలిపారు. ఆ మేరకు బుధవారం పాత బస్టాండ్ వద్ద సిపిఎం జెండా స్తూపం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివనారాయణ మాట్లాడుతూ జిల్లాలో బద్వేలు, మైదుకూరు, కడప ప్రాంతాల్లో బస్సు యాత్ర జరుగుతుందని, ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రానికి సంజీవని అయిన ప్రత్యేకహోదా మరిచారన్నారు. మోడీ అదాని, అం బానీ వంటి కార్పొరేటు దిగ్గజాలకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. పాద యాత్రలో జగన్ ఇచ్చిన హామీలను మరిచి కేవలం బటన్ నొక్కుడు కార్యక్రమం మా త్రమే మొదలు పెట్టారన్నారు. అదొక్కటే సంక్షేమం కాదన్నారు. ప్రజా రక్షణ భేరి కార్యక్రమం ప్రజల వద్దకు రానున్నదని తెలిపారు. నవంబర్ 1న బస్సు యాత్ర చేరుకుంటుందన్నారు. ప్రజలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో హుస్సేన్, శేఖర్, రాజేంద్ర, రాకెట్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

ప్రజాశక్తి-పీలేరు: నియోజకవర్గంలో సంభవించే అగ్ని ప్రమాదాలను సమర్థవంతంగా నివారించడానికి వీలుగా కొత్త అగ్నిమాపక యంత్రాన్ని కేటాయించినట్లు పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం పీలేరు అగ్నిమాపక కేంద్రానికి కొత్తగా కేటాయించిన అగ్నిమాపక యంత్రాన్ని ఎమ్మెల్యే పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందరేగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని ఒక్క పీలేరు నియోజకవర్గంలో మాత్రమే రెండు అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయని అన్నారు. పీలేరు నియోజకవర్గ కేంద్రం అవడంతో పాటు రెండు జాతీయ రహదారుల మధ్య ఉండడంతో పీలేరు అగ్నిమాపక కేంద్రానికి అదనంగా కొత్తగా మరో అగ్నిమాపక యంత్రాన్ని తీసుకు రావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో స్థానిక అన్నమయ్య జిల్లా డిడిఆర్ఎస్ అనిల్ కుమార్, అగ్నిమాపక అధికారి ఎస్.మస్తాన్, సహాయ అగ్నిమాపక అధికారి శ్యామ్, సిబ్బంది, పీలేరు జడ్పిటిసి ఏటి రత్న శేఖర్ రెడ్డి, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎండి షఫీ, వైసిపి నాయకులు డాక్టర్ షేక్ హబీబ్ బాష, మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, కంభం భాస్కర్ రెడ్డి, ఆనంద్, ఉదయ్, జిల్లా పర్యావరణ శాఖ బోర్డు డైరెక్టర్ షేక్ షాకీర్, పీలేరు ఎఎంసి చైర్మన్ ఎల్లయ్య, డైరెక్టర్ మునీర్ పాల్గొన్నారు.

అమృత్‌నగర్‌లో 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్) : రాష్ట్ర ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని పాత అమృత్‌నగర్ కె4 సచివాలయంలో బుధవారం సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తహశీల్దార్ నజీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పలువురు కొత్తపల్లి పంచాయతీ ఎంపిటిసిలు, వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

క్రైం కార్నర్



ప్రమాదానికి గురైన బైకు, కారు

కారు, బైక్ ఢీ : ఒకరు మృతి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని ఎర్రగుంట్ల-తిప్పలూరు ప్రధాన రహదారిపై బుధవారం కారు బైకును ఢీకొన్న ఘటనలో తిప్పలూరు గ్రామానికి చెందిన నన్నే బా (52) మృతి చెందాడు. పోలీసుల వివరాలు మేరకు.. నన్నేబా అతని అన్న షరీఫ్ టీవీఎస్ మోటార్ సైకిల్‌పై తిప్పలూరు గ్రామం నుండి ఎర్రగుంట్ల వైపు వస్తుండగా మూన్ లైట్ రెస్టారెంట్ వద్దకు రాగానే వెనుక వైపు నుండి తమిళనాడుకు చెందిన కారు బైక్‌ను ఢీకొంది. నన్నేబా తీవ్రంగా గాయపడ్డాడు. షరీఫ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే నన్నేబాను 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తలకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స పొందుతూ నన్నేబా మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఆరుగురు మట్కా బీటర్లు అరెస్టు


ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో మట్కా ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు సిఐ చాంద్ బాషా తెలిపారు. సిఐ ఆధ్వర్యంలో బుధవారం ఎస్ఐ తిరుపాల్ నాయక్ మట్కా బీటర్లపై దాడులు చేశారు. ఉప్పు కుమార్, పామిశెట్టి వీరాంజనేయులు, పులి కిరణ్‌కుమార్, తంబాపురి చంద్రబాబు, మూరింటి గంగాధర్, కాటం మహేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సిఐ చెప్పారు. వారి వద్ద నుండి మట్కా స్లిప్‌లతో పాటు రూ.50,400 నగదు స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలైన మట్కా, గ్యాంబ్లింగ్, డ్రంకన్ డ్రైవ్ వంటి జోలికి వెళ్లకూడదని సూచించారు.

అటవీ శాఖ కార్యాలయానికి కొత్త సొబగులు

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు అటవీశాఖ ఎఫ్ఆర్ఒ అశోక్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక అటవీశాఖ కార్యాలయం కొత్త సొబగులను సంతరించుకుంది. ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ అశోక్‌కుమార్ యాదవ్ సొంత నిధులతో కార్యాలయ అభివృద్ధికి కృషి చేశారు. ఆయన ఎఫ్ఆర్ఒగా బాధ్యతలు చేపట్టిన రెండు నెలల్లో ఉన్నతాధికారులు, సిబ్బంది సహాయ సహకారాలతో కార్యాలయాన్ని అభివృద్ధికి బాటలో నడిపించారు. కొన్ని దశాబ్దాలుగా కార్యాలయం ఆవరణలో పేరుకుపోయిన చెత్త, గడ్డి, కంపచెట్లు తొలగించారు. పరిసరాలను శుభ్రం చేయించారు. కార్యాలయం, పహారీకి రంగులు వేయించి కొత్త హంగులు దిద్దారు. లోపలికి ప్రవేశించే మార్గంలో గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేసి రూపురేఖలు మార్చారు. కార్యాలయాన్ని చూసి అటవీశాఖ అధికారులను ప్రజలు అభినందించి, హర్షం వ్యక్తం చేశారు.


ముద్దనూరు అటవీశాఖ కార్యాలయం

28న వైసిపి సామాజిక సాధికారత బస్సు యాత్ర


మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

వైసిపి రాష్ట్ర శాఖ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా గురువారం నుంచి చేపట్టిన సామాజిక సాధికారత బస్సుయాత్రలో భాగంగా ఈనెల 28న ప్రొద్దుటూరులో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి కడప జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథరెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు సురేష్‌బాబు, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆ మేరకు స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథిగృహ ఆవరణలో బుధవారం వైసిపి శ్రేణులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆకేపాటి అమర్నాథరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నాలుగు జోన్లలో ఈనెల 26 నుండి సామాజిక సాధికారత బస్సు యాత్రను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి బడుగు బలహీన వర్గాలకు ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర పాలనలో రాజ్యాధికారం దిశగా అడుగులు వేసిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది వైసిపినే అని పేర్కొన్నారు. పదివేల మందితో ప్రతి నియోజకవర్గంలో బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు ఆధ్వర్యంలో ఈ బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సురేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర పాలనలో బడుగు బలహీన వర్గాలకు ప్రాధాన్యతనిస్తూ సామాజిక న్యాయం పాటించి 60 శాతం రాజ్యాంగ పదవులు కట్టబెట్టిందని ఆయన గుర్తు చేశారు. ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ బస్సు యాత్రను విజయవంతం చేసే దిశగా వైసిపి శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జేసిఎస్ జిల్లా కన్వీనర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, మునిసిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, వైస్ చైర్మన్ సిఎస్ ఖాజామొహిదీన్, రాయలసీమ పోలీసు కంప్లైంట్ అథారిటీ సభ్యులు కాకర్ల నాగ శేషారెడ్డి, మండల వైసిపి కన్వీనర్ మార్తల ఓబులరెడ్డి, పట్టణ వైసిపి అధ్యక్షులు కామిశెట్టి బాబు, మహిళా అధ్యక్షురాలు కోనేటి సునంద, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి పగిడాల దస్తగిరి, కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, నాయకులు మీగడ చంద్రశేఖర్‌రెడ్డి, పాలగిరి ఖజా, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల కష్టాలు పట్టని ప్రభుత్వం


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వైసిపి ప్రభుత్వానికి రైతుల కష్టాలు పట్టడంలేదని మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవి తెలిపారు. ప్రస్తుతం రబీ సీజన్ కూడా రైతులను పట్టించుకోవడంలేదని బుధవారం తెలుగుదేశం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పేర్కొన్నారు. విజయదశమి రోజు పార్టీ కార్యాలయాన్ని లాంఛనంగా ప్రారంభించామన్నారు. నిత్యం పార్టీ కార్యాలయంలో నాయకులు, ప్రజలకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం7 గంటల వరకు అందుబాటులో ఉంటామన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరిస్తామన్నారు. అధికారంలోకి రాగానే పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. పులివెందుల నియోజకవర్గంలో రైతులు రబీ పంటపై ఆధారపడి ఉన్నారని, వర్షం లేక సాగు చేయలేకపోతున్నారన్నారు. కాలువలకు, చెరువులకు నీళ్లు నింపకుండా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారని ప్రశ్నించారు. తెలుగుదేశం ప్రభుత్వంలో రైతులకు బీమా వచ్చిందన్నారు. వైకాపా ప్రభుత్వంలో ఏ పంటకు ఎప్పుడు బీమా వస్తుందో రైతులకు తెలియడం లేదన్నారు. రైతులకు సక్రమమైన కరెంటు కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. తాము అధికారులను ప్రశ్నిస్తే సిబ్బంది కొరత ఉందని చెబుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం డ్యాంల నుంచి కాలువలకు నీటిని విడుదల చేయాలని, లేని పక్షంలో రైతులతో కలసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టుకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలో విలేకరిగా, ఒక పత్రిక కార్యాలయంలో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రసాద్ అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న నేపథ్యంలో వైయస్సార్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మాచిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్థికసాయం చేశారు. కొంతమంది జర్నలిస్టులు, ప్రెస్ క్లబ్ తరఫున రూ.30వేలు నగదును బుధవారం చంద్రమోహన్‌రెడ్డి ప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న జర్నలిస్టులకు వైయస్సార్ ప్రెస్‌క్లబ్ ఎల్లవేళలా తోడు ఉంటుందన్నారు. ప్రసాద్‌కు వైయస్సార్ ప్రెస్‌క్లబ్ తరఫున రూ.10వేలు, జర్నలిస్టులతో సేకరించిన మరో రూ.20వేలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడు జయ రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్, ఉప కార్యదర్శి రమణారెడ్డి, గౌరవాధ్యక్షులు కష్ణకుమార్, వివేక్, కోశాధికారి ఓం ప్రకాష్, ఉప కోశాధికారి మురళి, సభ్యులు సురేంద్ర, అమర్, జయరామిరెడ్డి, జాకీర్, సాదక్ వల్లి, పఠాన్, రమణ, చిక్కని హరికుమార్ పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న అధ్యక్షులు, సభ్యులు

ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన విష్ణు నారాయణ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



పులివెందుల పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ-2గా విష్ణు నారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, జూదం, బెట్టింగ్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన స్థానంలో గతంలో పని చేస్తు న్న సత్యనారాయణను ఈనెల 13న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ విఆర్‌కు పంపారు.

జగన్‌ను సైకో అనడం సబబుకాదు

- జడ్‌పిటిసి శివప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - చక్రాయపేట

రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని టిడిపి నేతలు సైకో అనడం సబబుకాదని జడ్‌పిటిసి శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సైకో పోవాలని టిడిపి నాయకులు ఒక్కరే చెబుతున్నారే తప్పా ప్రజల్లో లేదన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలను జగనన్న అమలు చేస్తుంటే, అలాం టి సిఎంను టిడిపి నాయకులు సైకో అనడం సమంజసం కాదన్నారు. 14ఏళ్లపాటు టిడిపి అధికారంలో ఉన్నప్పుడు గ్రామాల్లో ఏ అభివృద్ధి చేశారో చూపించాలని జడ్‌పిటిసి టిడిపి నాయకులను ప్రశ్నించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలు నిర్మించలేని దుస్థితి టిడిపిది అన్నారు. ప్రతి గ్రామం పట్టణంలా కనపడాలనే ఉన్నత ఆశయంతో సిఎం జగన్ కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. పార్టీలతో సంబంధం లేకుండా అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న పేరు సిఎం జగన్‌కే దక్కు తుం దన్నారు. చంద్రబాబు తప్పు చేయడం వల్లే రిమాండ్‌లో ఉన్నారన్నారు. ప్రజలే టిడిపి నాయకులకు ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

కమిషనర్ ఉత్తర్వులను అమలు చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పాఠశాల విద్యకమిషనర్ ఉత్తర్వులను ప్రయివేట్ స్కూల్ యాజమాన్యాలు అమలు చేయాలని ప్రయివేట్ టీచర్స్ ,లెక్చరర్స్ సంఘ రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఈ నెల 17న పాఠశాల విద్య కమిషనర్ ప్రయివేట్ స్కూల్ యాజమాన్యాలతో విజయవాడలో సమావేశం నిర్వహించారని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రయివేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లు, నాన్ టీచింగ్ సిబ్బందికి న్యాయపరంగా రావలసిన వాటిని ఖచ్చితంగా ఇప్పించేలా ఆర్‌జెడి, డిఇఒలు చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చారన్నారు. బ్యాంకు ఖాతాల ద్వారా జీతం ఇవ్వాలన్నారు. ఇపిఎఫ్‌ను జమ చేయాలని, ఆరోగ్యబీమా చెల్లించాలన్నారు. అనారోగ్యంతో ఉన్న సిబ్బందికి మానవతా ధృక్పథంతో జీతం చెల్లించాలన్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా సిబ్బందిని తొలగించకూడదన్నారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకా రంగా ప్రభుత్వ సెలవులు మంజూరు చేయాలని గడ్డం రాజు డిమాండ్ చేశారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్


పథకాల గురించి వివరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

వైసిపి ప్రభుత్వంలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందు తున్నాయని ఆ పార్టీ మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దేశాల మేరకు బుధవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని చిన్న కొండప్ప కాలనీ, నగిరిగుట్ట సచివాలయ పరిధిలోని ప్రాంతాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం లో మునిసిపల్ చైర్మన్ డాక్టర్ వల్లెపు వరప్రసాద్, సివిల్ సప్లయ్ డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ హాఫీజ్, ఓతూరు రసూల్, కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లి కిషోర్, జేసిఎస్ కన్వీనర్ చంద్రమౌళి, కో ఆప్షన్ చంద్రమౌళి, నాయకులు వీరారెడ్డి, పద్మనాభరెడ్డి, శానిటేషన్ అధికారులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ ఎరువులు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - వేంపల్లె


పురుగుల మందులను తనిఖీ చేస్తున్న అధికారి అనిత

నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే అలాంటి దుకాణాల యజమానులపై చర్యలు తీసుకుంటామని భూ సంరక్షణ విభాగపు సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదేశాలు మేరకు బుధవారం వేంపల్లె మండల పరిధిలో ఉన్న ఫెర్టిలైజర్స్ దుకాణాలను అనిత, ఎఒ రాజేంద్రప్రసాద్ తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించారు. పురుగు మందులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేని పురుగుల మందులను, ఎరువులు, విత్తనాలను అమ్మరాదన్నారు. రైతులకు విక్రయించే ఎరువులు, పురుగు మందులకు సంబంధించి రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. రైతులకు తప్పకుండా బిల్లులు ఇవ్వాలని కోరారు. ఎంఆర్‌పికే పురుగు మందులు విక్రయించాలన్నారు. స్టాక్ రిజిస్టర్ లేకపోతే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో చక్రాయపేట ఎఒ నవంత్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్, ఎఇఒలు, విఎఎలు పాల్గొన్నారు.

30న మండల స్థాయి ప్రతిభ పరీక్ష

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 8, 9, 10 తరగతి విద్యార్థులకు ఈనెల 30న మండలస్థాయి డాక్టర్ బీరం విశ్వనాథరెడ్డి మెమోరియల్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించనున్నట్లు ట్రస్టు నిర్వాహకులు బీరం మల్లారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోటీ పరీక్ష ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష ఉదయం 10గంటల నుంచి గంటన్నరపాటు ఉంటుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు 90590 76177 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. పోటీలో పాల్గొనే విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని కూడా సంప్రదించవచ్చని అన్నారు. ప్రతిభ పరీక్షలో విజయం సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రంతోపాటు రూ.5000, రూ.3000, రూ.2000 నగదును అందజేయనున్నట్లు వివరించారు.

నేత్రదానం.. ఇద్దరు అంధులకు వెలుగు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

నేత్రదానం ఇద్దరు అంధులకు వెలుగునిస్తుందని స్నేహిత అమృత హస్త సేవాసమితి అధ్యక్షులు ముమ్మిల రాజు పేర్కొన్నారు. పట్టణంలోని సరస్వతి వీధికి చెందిన పెద్దారెడ్డి రామసుబ్బమ్మ మంగళవారం రాత్రి మరణించడంతో కుమారులు బ్రహ్మానందరెడ్డి, శ్రీరామరెడ్డి, కోడళ్ళు సావిత్రి, కష్ణవేణి, మనవళ్ళు జగన్‌మోహన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మానవరాళ్లు సుచిత్ర, యమున వారి బంధువు పట్టణంలోని డాక్టర్ శ్రీ సిరి నేత్రదానంపై అవగాహన కల్పించడంతో వారు రామసుబ్బమ్మ నేత్రదానానికి అంగీకరించారు. దీంతో రాజు, టెక్నీషియన్ హరి మృతదేహం నుంచి కార్నియాలను సేకరించి, హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్ర నిధికి పంపారు.

నియంతలా వైసిపి ప్రభుత్వం : భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

వైసిపి ప్రభుత్వం నియంతలా వ్యవహరిస్తోందని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి తెలిపారు. ఎర్రగుంట్ల మున్సిపాలిటీ పరిధిలోని 2వ కౌన్సిల్ వార్డు ఇందిరా కాలనీ, మెయిన్ బజార్‌లో బుధవారం బాబుతో నేను, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ ఏ ఆధారం లేకుండా చంద్రబాబును అక్రమ అరెస్టు చేశారని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి ఓర్వలేక జగన్ ప్రభుత్వం నియంతలా వ్యవహరిస్తోందని విమర్శించారు. పేద ప్రజల బతుకుల్లో వెలుగు రావాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. టిడిపి మినీ మేనిఫెస్టో అమలును ఇంటింటికి తిరుగుతూ వివరిస్తూ, కరపత్రాలను పంపిణీ చేశారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రబాబును ముఖ్య మంత్రిగా, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల మండల ఇన్‌ఛార్జి జయరామిరెడ్డి, మండలం పార్టీ బాధ్యులు మోహన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, నాగేశ్వరరావు, టైలర్ మాబు, ప్రసాద్, ప్రభుదానం, యోహన్, కొండారెడ్డి, తుంగ మోహన్, సలీం, స్వరూప్, మల్లేష్, నరసింహారెడ్డి, మల్లికార్జునరెడ్డి, సంజీవ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేస్తున్న భూపేష్‌రెడ్డి

2024లో మళ్లీ వైసిపిదే గెలుపు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా మళ్లీ వైసిపి అధికారంలోకి వస్తుందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోస మనోహర్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ బస్సు యాత్రలో దళితులు, గిరిజనులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేసి, ఎమ్మెల్యే రాచమల్లు సత్తా చూపుతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ బిసి, మైనార్టీలు బస్సు యాత్రను విజయవంతం చేసేం దుకు సిద్ధంగా ఉన్నారన్నారు. బాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దళి తులకు, గిరిజనులకు అసైన్‌మెంట్ కమిటీ లేకుండా తీవ్ర అన్యాయం చేశారన్నారు. పవన్‌కళ్యాణ్ దళితులకు, గిరిజనులకు ఫలానా చేస్తామని ఎక్కడా చెప్పిన సందర్భం లేదన్నారు. జనరంజకమైన పాలనతో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి చూపిస్తున్న జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని తెలిపారు.


మాట్లాడుతున్న గోస మనోహర్